
# దాంపత్యము



తాత కృష్ణమూర్తిగారు, బి. ఏ., యల్. టి.,

ఉదయంనుండి లక్ష్మిమీద ధుమధుమ లాడుతునే ఉన్నాను. చీటికీ, మాటికీ కోపం ముంచుకొస్తూ వుంది. కాని బహు శాంతం. ఓర్మి వహిస్తున్నాను. ఎంతకని సహించగలడు మనిషన్నవాడు? చీవాట్లు పెడుతున్నాను; తిడుతున్నాను; వెక్కిరిస్తున్నాను; దాన్ని, దానివాళ్లని, అందర్నీ యెత్తిపొడుస్తున్నాను; నన్ను, నా ఉద్యోగాన్ని, నా దరిద్రాన్ని, నా స్వభావాన్ని, నన్ను పుట్టించిన దేవుణ్ణి, కసి తీరా తిట్టుకుంటున్నాను. చెయ్యెత్తి చెంపమీద నాలుగు కొట్టి, లక్ష్మికి బుద్ధి చెప్పాలని వుంది; కాని ధైర్యం చాలదు. అది గాక, లక్ష్మి అంటే నాకు ప్రాణం. దాన్ని కొడదామనే తలపు కలిగినందుకే సిగ్గుగా వుంది. కాని,......

మనసుకు శాంతి లేదు. పనిపాట్లయందు శ్రద్ధ లేదు. ఏమీ తోచదు. ఆఫీసులో పని తెమలకపోవడం చాత, యెన్నడూ నన్ను పల్లెత్తుమాట అనియెరగని దొర, యెగిరిపడుతున్నాడు. క్లబ్బులోనైనా విశ్రాంతి లభించకుండావుంది. వార్తాపత్రికలలోని విశేషా లేవో చదివి, నాతో ఒకపెద్దమనిషి పొలిటిక్స్ చర్చించబోతాడు. ఏదో పిచ్చిపిచ్చి ప్రశ్న లడుగుతాడు. జబాబు చెప్పకుంటే విసుగుకుంటాడు; చెప్తే అర్థం చేసుకోలేక తెల్ల మొహం వేసి చూస్తాడు. బ్రిడ్జిఆటకు కూచునేసరికి, నాపార్ట్నరు నామీద కారాలు మిరియాలు నూరడం ప్రారంభించాడు.

ఇంటికి వచ్చే రావడంతోనే, పిల్లలు రేచుక్కల వలె మీదపడి, నానాఅల్లరి చేస్తున్నారు; యేడుపులు, నవ్వులు, ఫిరియాదులు, కాట్లాటలు, అసందర్భప్రలాపాలు......బలేచికాకుగా వుంది! ఉయ్యాల్లోవున్న చేతివెధవ నిద్రపోతున్నవాడల్లా లేచి కూర్చుని తేలు కుట్టినట్లు ఒక టేయేడుపు!

"లక్ష్మి, గ్లాసుతో మంచినీళ్లు తీసుకు రా."

ఎంతసేపటికీ లోపలనుండి లక్ష్మి యివతలికి రాదు. మంచినీళ్లు తేదు. గొంతుక యెండిపోతూవుంది. బూట్సుతో వంటింట్లోకి జొరపడేసరికి, లక్ష్మి యెదురుగా వచ్చి, నావేపు యెగాదిగా చూసి, 'ఏం కావాలి?' అని అడుగుతుంది, వొళ్లు మండుకొచ్చేటట్లు. జబాబు చెప్పకుండా, మడిలో వున్న మంచినీళ్లబిందె ముట్టుకొని, గ్లాసుతో నీళ్లు ముంచుకున్నాను.

"అది పాలగళాసు. కడగలేదు. మరొకటి తెస్తాను, ఆగండి."

"ఎప్పుడో తెస్తావు. దాహంవలన పీకార్చుకొపోయి, నేను చచ్చినవెనక! గంటసేపటినుంచి అరుస్తున్నాను, నీళ్లోనీళ్లో అని."

"ఈపిల్లలగోలలో నాకు మీమాట వినిపించలేదు. అన్నం వారుస్తూవుండగా, మీజోడుచప్పుడు

విన్నాను. వెంటనే చేతులు కడుక్కొని, రానే వొస్తున్నాను." అంటూ పంచపాత్రతో నీళ్లు అందించింది.

"ఇంకా వంట కాలేదూ? అర్ధరాత్రి కావొచ్చింది! ఆకలిచేతః నాకు కడుపులో దహించుకొపోతూవుంది."

"ఈవాళ ప్రొద్దు గ్రుంకినది మొదలు పిల్లడు చెయ్యి దిగలేదు. ఉయ్యాల్లో వేసి, రెక్కలు పీకేవరకూ ఊపితే యిప్పుడిప్పుడే కన్ను మూశాడు. కాని యీ పిల్లలు వాణ్ణి నిద్రపోనిస్తారా? ఒకటే అల్లరి–కేకలు–పోట్లాటలు. నేనంటేయెవరికీ భయం లేదుకదా!...... మీరు దుస్తులు విప్పి స్నానం చేసేలోపున, వంట అవుతుంది లెండి."

స్నానం చేసి పెరట్లో చల్లగాలికి వెన్నెల్లో పచారుచేస్తున్నాను. ఒళ్లు చల్లపడినా, మనసు మండుతునేవుంది. అంతకంతకూ, లక్ష్మిమీద కోపం రగులుతునేవుంది.

స్వతహాగా నేను కోపదారిమనిషిని కాను. కోపిష్టినని పరిహాసానికైనా నన్నెవరైనా అంటే సహించుకోలేను. బహుశాంతమూర్తినని, వివేకవంతుడనని, చదువుకున్నవాడినని నాకు గర్వం. ఒక్క లక్ష్మే, నన్నప్పుడప్పుడు దెప్పిపొడుస్తూవుంటుంది. నాకు కోపం తెప్పించి, "అదిగో, కోపం వొచ్చింది కదూ? మరి కోపం, తాపం లేనిమనిషినని బడాయి చెప్పుకోవడమెందుకు?"అని పకపక నవ్వుతుంది. లేనితప్పులుకూడా నాలో వెతికి చూపించి నన్ను గేలిచేస్తుంది. "హాస్యానికేమన్నా తప్పు పట్టకూడదు సుమండీ!"అని మళ్లీ బుజ్జగిస్తూవుంటుంది. దానిపెంకెతనానికి హద్దు లేదు. ఇంటి యజమానినని కాని, తనకు భర్తనని కాని పిసరంత లక్ష్యం లేదు. భయం, భక్తి ఉన్నప్పటికీ, పెంకెతనం, చనువు జాస్తీ అయినాయి. తనకంటె నేను అనేకరెట్లు తెలివైనవాడినని, ప్రవీణుడనని, బలవంతుడనని లక్ష్మికి నమ్మకం తగ్గిపోతూవుం దనుకుంటాను. లేకుంటే,..................

చదువుకుంటున్న రోజుల్లో నాకు పెళ్లి, సంసారం అంటే యెట్లాటి అభిప్రాయాలు ఉండేవని? నాతో సరిసమానమైన యీడు, చదువుగల అందకత్తెను సంపాదించి, పెళ్లి అనే నిబంధన లేకుండా, ఆ మెతో కలసి కాపురం చేస్తూ, స్వర్గానందం అనుభవించగల ననుకునే వాణ్ణి కొన్నాళ్లు. పురుషజన్మ యెత్తినందుకు సార్థకంగా విధవావివాహం చేసికొని, సంఘసంస్కర్త నని కీర్తి సంపాదించాలనుకునే వాడిని కొన్నాళ్లు. బ్రహ్మసమాజంలో కలసి యేకులంపిల్లనయినా సరే, మనసారవలచి పెండ్లిచేసుకుందామా,అనుకునేవాడిని కొన్నాళ్లు. డబ్బులేదు కాని, లేకుంటే లండన్ వెళ్లి, దొరసాన్ని వివాహమాడితేనేకదా జన్మసాఫల్యం అనుకునే వాడిని కొన్నాళ్లు. నాఉద్దేశాలు, అభిప్రాయాలు, కోర్కెలు అన్నీ క్రమంగా లోలోపనే జీర్ణించుకున్నాను. అబ్బో గొంతెమ్మకోర్కెలు ఎన్నెన్ని ఉండేవని? 'నా కాబోయే భార్య రూపంలో రంభవలె మహా అందమైనదై ఉండాలి. చదువుసంధ్యలలోను, సంగీతంలోను సరస్వతిని మెప్పించాలి. మంచి దేహారోగ్యం, పెద్ద నల్లని జుట్టు, చెంపకి చారడేసి కళ్లు, ఆణిముత్యాలవంటి చక్కని పల్వరుస, వినయప్రవర్తన, పతిభక్తి—అన్నీ ఉండాలి' అనుకునేవాడిని. కాబట్టి మావాళ్లు వెతికివెతికి, కుదుర్చుకొని వచ్చిన సంబంధా లేవీ నాకు నచ్చకపోవడం సహజమే! వాళ్లు చూసేదల్లా యీడు, రూపం సంప్రదాయం, కట్నం. 'పిల్ల అందంగా లేదని నేను మాటివిరిస్తే 'నీ అందానికి చాలక పోయిందా?' అనబోయి, 'సంసార్లకు అందంతో యేం పని?' అని సమాధానం చెప్పేవాళ్లు. 'భూమికి జానెడు లేదుకదా,యీ అమ్మాయినా పెళ్లిచేసుకో మంటారు?' అని అడిగితే, 'నీచదువుసంధ్య అన్నీ పూర్తి అయేసరికి యెదగకపోతుందా?' అనేవాళ్లు. ఎలాగైతే నేమి, నా బి. యే. చదువు పూర్తి అయేదాకా, వచ్చిన సంబంధమల్లా తప్పించుకున్నాను.

పెళ్లిచూపులకు లక్ష్మిని చూడడానికి వెళ్లినప్పుడు దానికి 12 యేండ్లు. మనిషి కొంచెం యేపుగా

బలంగా ఉండేది. అంచాత, వాళ్ల అమ్మ మరో రెండేళ్లు మీద వేసింది. "మొన్నటి శ్రావణానికి మాపిల్లకు పద మూడేళ్లు వెళ్లి పధ్నాలుగోయేడు వచ్చింది. ఇక ఆప డానికి వీల్లేదు. ఈవైశాఖంలో పెళ్లి చెయ్యక తీరదు." తెల్లగా, దుబ్బుగా, అందంగా ఉన్న పిల్ల, ముస్తాబుమీద మరీ చక్కగా కనిపించింది నాకళ్లకు.

"మీఅమ్మాయికి యింగ్లీషు వొచ్చునా?"

"రాదు."

"లేసుకట్టు చేత నవునా?"

"నేర్చుకోలేదు."

"టెన్నిస్ ఆడగలదా? బైసికిల్ యెక్కుతుందా?" అని కూడా అడగాలని మొదట అనుకున్నాను. కాని, మరి సాహసించలేకపోయినాను. పల్లెటూరుపిల్ల గనుక, నాగరికత తక్కువ అని యేదోసమాధానం చేసుకున్నాను. కాని, తర్ఫీదు చేసి, క్రమంగా లక్ష్మిని దొరసానివలె చెయ్యాలని నిశ్చయించుకున్నాను. రెండుమూడేళ్లలో నా బి. యే. క్లాసు ఇంగ్లీషంతా దానికి చెప్పేలేనా అనుకున్నాను.

కాపురానికి వచ్చిన ఒక్క యేడాదిపాటు, మహా దీక్షగా చదువు చెప్పేవాడిని, లక్ష్మికి; మొదట యెంతో అడకువతోను, ఆసక్తితోను, ప్రారంభించింది. మంచి చురుకైన తెలివితేటలున్నాయి. కాని, చదువు చెప్పాలని నాకు, నేర్చుకుందామని దానికి, మనసులో యెంత అభిలాష ఉంటే యేం లాభం? పడుచుదాంపత్యం. కొత్తప్రేమ!—చదువు సాగేదెట్లా? కాని, పాపం, నాయిష్టానికి యెన్నడూ వ్యతిరేకంగా నడుచుకుందుకు యత్నించేది కాదు. నవీన నాగరికతకు తర్ఫీదుచేసి, ఆమెరూపానికీ, ప్రవర్తనకీ, శోభ కూర్చాలని నాసంకల్పం! సబ్బులు, వాసన నూనెలు, ఫేస్‌పౌడర్లు, ఉలుదారంకట్టలు, అల్లిక పుల్లలు, కొప్పుపిన్నులు, దువ్వెనలు, సన్నబట్టలు— వీటికి బాగా అలవాటుచేశాను. పసుపు, గోమయం, అలుకుగుడ్డ, చీపురుకట్ట మొదలైనవి తాకనిచ్చేవాడిని కాను. ఇంగ్లీషుముక్కలు నాలుగు నేర్చుకుంది. చల్దిఅన్నం తినడం మానేసి, కాఫీ ప్రారంభించింది. మధ్య పాపిట మాని వంకపాపెట తీసేది. సన్నని మజ్లిన్‌చీరెలు కట్టేది. జాకెట్లకు లేసు తనే కుట్టుకునేది. ఇంట్లో నడిచినప్పుడు సహితం, మొహమల్‌జోడు విడిచేది కాదు. పసుపు, కాటుక మానేసింది. బొట్టుమాత్రం మానిపించలేకపోయినాను. రోజుకు మూడుసార్లు దంతధావనం చేసేది. ఉదయం, సాయంత్రం సబ్బుతో వొళ్లు తోముకునేది. గొంతెత్తి, వైదీకంగా అరవకుండా, నెమ్మదిగా ముక్తసరిగా మాటాడేది. మాటికీ చీటికీ, నాతో ప్రణయకలహం లేపి, కోపం నటించి, నన్ను పిచ్చివాడిని చేసి, బతిమాలించుకునేది. ఇరుగు పొరుగుస్త్రీల అనాగరికతకు, రోత, ఆశ్చర్యం, జాలి పొందేది. ఇట్లా రోజుకు రోజుకు లక్ష్మిలో నాజూకు అధికం కాజొచ్చినకొద్దీ, నా సంతోషానికి మేర లేకుండా ఉండెను. అంతా నాప్రతాపమే కదా, అని గర్వించేవాడిని. తిక్కమనిషి; వీథిలోకి నాతో షికారురమ్మని యెంత ప్రోత్సహించినా వొచ్చేది కాదు. కాని మొగవాళ్లని చూస్తే, మోటారు చూసిన పల్లెటూరుగొడ్డువలె బెదరడం మాత్రం, ఆమె యెన్నడూ యెరగదు.

మా పెద్దవాడు పుట్టినతరువాత, ఉన్న ఊరు నుండి నాకు బదిలీ కావడం, ఇంట్లో దాసీత కెవరూ లేకపోవడం, డబ్బుకు కొంచెం యిబ్బంది కలగడం— అన్నీ ఒక్కసారే తటస్థించాయి. ఇల్లు చక్కబెట్టుకోవడం, పిల్లడిసంరక్షణ చూడడం, నాకు వేళకు వండి పెట్టడం—వీటితో కాలం సరిపోయేది లక్ష్మికి. పన్నెలు, పిన్నులు, ఉలుదారాలు, ఇంగ్లీషుచదువు అన్నీ మూల పడినవి. క్రమంగా ఆమెరూపంలోను, దేహారోగ్యంలోను కొన్ని మార్పులు కనిపించినవి. పని పాట్లతో అలసి, శరీరం మోటుతేరింది. తనఅందం, సౌఖ్యం, కాపాడుకుందుకు దానికి శ్రద్ధ తగ్గిపోయింది. మొహంలో కొండెనవ్వు, పెంకెతనం, యౌవనగర్వం, పోయి ఒకవిధమైన 'సీరియస్‌నెస్' వచ్చింది. నామీద పూర్వంవలె యిప్పుడు ప్రేమ చూపడానికి అట్టే ప్రయత్నించేది కాదు. ఇప్పుడామెకు లోకమంతా ఆబిడ్డ;

తన సౌందర్యం, యౌవనం, నిద్ర, బలం, శుభ్రత, నాగరికత, భర్త—అన్నీ ఆపసికందుకే అర్పించింది. నేను చెప్పరాని యీర్ష్యతో బాధపడేవాడిని.

పిల్లడికి తల్లిపాలు సమృద్ధిగా ఉండేవి. చనుబాల కంటె హార్లిక్సు మంచివని బోధిస్తే కస్సుమనేది. పాల తల్లిని కుదురుస్తానంటే వొప్పేది కాదు. లక్ష్మికీ నాకూ యీవిషయమై తరుచుగా యింట్లో యుద్ధం జరుగుతూ వుండేది.

"లక్ష్మి, నీఆరోగ్యం కాపాడుకోవూ?"

"తెలిసీతెలియని పిచ్చిసిద్ధాంతాలు చెప్పక, ఊరుకుందురూ! ఇదేనా యేమిటి,మీబి.యే.లో చదువుకున్న సయన్సు? బిడ్డకు పాలివ్వకుంటే, ఆతల్లి ఉండి యెవరికి ఉపచరిస్తుంది?"

"దొరసాన్లు చూడూ మరి దాదులు, పాల సీసాలు—"

"వాళ్ల ఖర్మం అది."

నవీననాగరికతాపద్ధతులకు అలవాటుచేయడానికి నేపడిన శ్రమ యావత్తూ బూడిదలో పోసిన పన్నీరైంది. సంసారబాధ్యతలు జాస్తీ అవుతున్నకొలదీ, ఆమెవద్ద శిష్యరికం వహించి, నేనే అనేకసంగతులు నేర్చుకోవలసి వచ్చింది. కడుపున పుట్టిన పిల్లడు బట్టలు మురికిచేస్తే, అసహ్యపడకూడదు—ఇంటిపనులు చేసుకుందుకు కేవలం నౌకర్లమీద ఆధారపడడం పొరపాటు—లేనిపోని షోకులకు డబ్బు తగలపెట్టడం తప్పు—సమయం వస్తే, విసుగుకోకుండా వంట చేయవలసిందే కాని, హోటేలుభోజనం పనికి రాదు—ఇట్లాంటి ధర్మసూక్ష్మాలు యెన్నో నేర్చుకోవలసివచ్చేది నాకు.

రెండోపురిటికి ఆడపిల్ల. ఆతరవాత, యీచేతివాడు. ఈముగ్గురుపిల్లలూ నా లక్ష్మిరాజ్యాన్ని పూర్తిగా తమస్వాధీనం చేసుకున్నారు. పిల్లలంటే నాకు పూర్వం ఉండే బులుపిప్పుడు తీరిపోయింది. పెళ్లాం అంటే కొత్తరికంలో నాకుండే ఇంగ్లీషభిప్రాయాలు మారిపోయినాయి. రోమాన్సు చచ్చింది. నాచదువుసంధ్యల ఫలితం— నా ఉద్యోగం యొక్క గౌరవం— ఇప్పుడింట్లో నా పెద్దరికం— అన్నీ ఒక్కమోస్తరుగానే వెలుగుతున్నాయి! చెప్పుకుంటే సిగ్గుచేటు. అన్నివిధాలా దేవుడు నన్ను లొంగదీసి, కాళ్లకూ చేతులకూ సంకెళ్లువేసి, కసి తీర్చుకుంటున్నాడు. స్వేచ్ఛగా విహరించే పక్షి, పంజరంలో పడి తప్పించుకునే సాధనం కానక, ముక్కు నేలకు రాసుకుంటూ, రెక్కలు టపటప కొట్టుకుంటూ వున్నట్లుంది నాఅవస్థ!

పదేళ్లక్రిందట పెళ్లిపీటలమీద చూసిన లక్ష్మికీ, యిప్పటి పెంకలక్ష్మికీ యేమైనా సామ్యం వున్నదా? అప్పుడేమీ యెరగని అమాయికురాలను పల్లెటూరు పిల్ల; చదువు లోకజ్ఞానం లేని అనాగరికురాలు. నా యిష్టానికిలోబడి నాచేతికీలుబొమ్మై, నా ఆజ్ఞచొప్పున నడుచుకొనే ముద్దరాలు. నామాటంటే వేదవాక్యంగా భావించే విధేయవతి; నా బుద్ధిబలం అంటే యెంతో విశ్వాసంగల ప్రియశిష్యురాలు. నన్ను సంతోషపరచడమే తనకు ముఖ్యధర్మమని గట్టినమ్మకంగల సాధుశీల! ఇప్పుడో!.........

"లక్ష్మి......లక్ష్మి!"

అదిగో, పిలిస్తే వినిపించుకోదు ... ... పిల్లల అల్లరి యింకా అణగినట్లు లేదు. వాళ్లు తిని పడుకుంటే నేకాని, యింట్లో గాలివాన వెలియదు. ఈవాళయేమో కాని ఆకలి ఉపద్రవంగా వేస్తూవుంది. ఈ వెన్నెల, యీ పువ్వులగాలి, యీచల్లదనం— అన్నీ వొంటిని తాకి, హాయి కూర్చడానికి బదులు మెదడుకు కాక పుట్టిస్తున్నాయి.

లక్ష్మి నన్ను బొత్తిగా నిర్లక్ష్యం చేస్తూవుంది. నాసదుపాయాలు యేవీ చూడదు. ఇటు పిలిస్తే, అటు పలుకుతుంది. ఒకటి చెప్తే మరొకటి చేస్తుంది— 'వండవే పోలీ' అంటే 'కుండపట్టుకొని నీళ్లకు పోతాను' అన్నట్లు. మీదుమిక్కిలి యేమైనా అంటే, సణుగుకుంటుంది 'ఈమొగాళ్ల నైజమే యింతకాబోలు! అని. కచేరీవేళకు రెండుమెతుకులు వండిపెట్టడానికి యజ్ఞం

చేస్తుంది. చిరిగిపోయిన పాతచొక్కాలు, పంచలు కాస్త కుట్టిపెట్టవే అంటే, "మీకు లోభత్వం అంత కంతకూ మరీ అధికమౌతూవుంది. చింకిబట్టలు పెట్లోపెట్టి దాచుకోకపోతే పిల్లడిపక్కకిందికి యిచ్చెయ్యరాదూ?" అని యెదురుతిరుగుతుంది. 'కాలరుగుండీ కనిపించ దేమి? ...తాళా లేవీ'అని అడిగితే, "పిల్లలు ఆడుకుందుకని తీసి, యెక్కడ పారేశారో!"అని నసుగుతూ చెప్తుంది. 'ఫౌంటెన్ పెన్‌లో సిరా అయిపోయింది. కొద్దిగా పోసి పెడుదూ'అంటే, "చేతులో పని వుంది. ఈవాళమట్టుకు నన్ను క్షమించి, మీరే పోసుకోవాలి."అని చల్లగా చెప్పేస్తుంది. 'ఆపిల్లడు యెందు కట్లా యేడుస్తాడు? ఏదో సమాధానం చేసి, ఊరుకోపెడుదూ' అంటే, "మూడురోజులనుండీ బిస్కట్‌డబ్బా ఒకటి తెచ్చిపెట్టమని బ్రతిమాలుతూవుంటే, వినిపించుకోరు గాని,—? ఈవాళ ఆదివారం, సెలవుదినం కదా, కచేరిహడావిడి లేదుకదా, నాకు పనివేళప్పుడైనా పిల్లల్ని కాస్త పిల్చి, ఆడిపించ కూడదూ? తప్పా?" అంటుంది. ఎప్పుడూ యింట్లో యిదే నాటకం. ఆఫీసులో నడుం పడిపోయేటట్లు పని చేసి, అధికార్ల చేత మాటలు పడుతూ, ఆరోగ్యం ఆత్మ గౌరవం చంపుకుని, యీదురోమని కాళ్లీడుచుకుంటూ యిల్లు చేరేపిమ్మటైనా, మనసుకు విశ్రాంతి లేదుకదా?

*　　*　　*　　*

పదిగంటలు అయింది కాబోలు. గాలి చల్లగా, బలే హాయిగా, వీస్తూవుంది. రోజూ రాత్రిళ్లు దోమలు చంపేవి—నిద్ర పట్టనివ్వక. వెన్నెలకూడా యెందు చాతనో, యీవేళ రమ్యంగా వుంది.

పిల్లలు సుఖంగా మైమరచి నిద్రపోతున్నారు. ఇంకా వంటింట్లో యెంగిళ్లెత్తుకుంటూనో పొయ్యి పేడ పెడుతూనో, అవస్థపడుతూవుంది కాబోలు లక్ష్మి! నిద్రపోదామంటే కళ్లు మూతలు పడకుండా ఉన్నాయి. ఈవాళ, పాపం, నిష్కారణంగా కోప్పడ్డాను దాన్ని. ఇందాకా, అదీ నేను, భోంచేస్తూవున్నప్పుడు మళ్లీ పశ్చాత్తాపం తెచ్చుకొని బుజ్జగించాను; కాని మనసులో యేమనుకుంటూవుందో? నొచ్చుకొని వుంటుంది.

నిజమే! పువ్వులాగ, నెత్తిమీద పెట్టుకోవలసిన మనిషిని, చాకరీలో పెట్టి నలిపేస్తున్నాను............
......"ఇంకా మేలుకొనే ఉన్నారూ? ఈసరి కప్పుడే గుర్రు తీస్తూ నిద్రపోతూవుండడం మామూలే?"

పను లన్నీ తీర్చుకొని, పట్టుచీర విప్పి, చాకింటి చీరకట్టుకొని, రవికతొడుక్కొని, కాళ్లు చేతులు,ముఖం సబ్బుతో కడుక్కొని, గదిలోకి వచ్చింది లక్ష్మి. టేబిలు మీది దీపం కొంచెం పెద్దది చేసి తమలపాకులు చీల్చుతూవుంది.

"తాంబూలం వేసుకున్నారా? లేక, మీకోసం కూడా నాలుగాకులకి సున్నం రాయమన్నారా?"

పరుపుమీద అటునుండి యిటు వొత్తిగిల్లి, "'అధికస్య అధికం ఫలం'—అన్నారు పెద్దలు. మళ్లీ వేసుకుంటాను నీచేత్తో యిస్తే."అని నవ్వుతూ అన్నాను.

మొహం యెత్తి నావేపు చూసింది, చిరునవ్వుతో. గాలి కామె చెంపమీది జుట్టు యెగురుతూవుంది.

"ఆ చీల్చినఆకులు చాలునులే......ఇట్లారా!" అని, దగ్గిరకి పిల్చి, ముంగురులు సవరిస్తూ, "తల దువ్వుకో లేదేం, యీవాళ?" అని ప్రేమతో అడిగాను.

"ఏమీ లేదు."

"నీమూర్ఖత, వైరాగ్యము ముసిలిచేష్టలు, నాకేమీ అర్థం కాకుండా ఉన్నాయి."

"మీ కేవీ అర్థం కావు. మీలోకమే మీది!" అంటూ, ముసిముసినవ్వుతో, "కొంచెం జరగండి...... ఆకులు చాలునా?"

"ఇట్లాటి చక్కని రాత్రివేళ, నువ్వే సంగీతం వొచ్చినదానివై యుంటే,—"

"నిజమే!......కాని, దేవు డివ్వనిదానిగూర్చి, లేకపోయిందే, అని కించపడడ మెందుకు? నాకు మరిరెండు చేతులు, మరిరెండు కాళ్లు దేవు డిచ్చివుంటే, యెంతో బాగుండును కదా, అనుకుంటూ వుంటాను."

"ఏం పెంకెవు!" అని పక్కున నవ్వి, గట్టిగా వక్షానికి అదుముకున్నాను.

"మీకు కోపం రాదంటే, ఒకటి చెప్పాలని వుంది. వింటారా, శాంతంగా?"

"అంతకంటేనా? చెప్పు."

కొంతసే పేదో ఆలోచిస్తూ ఊరుకుంది.

"చెప్పు మరి." అని ప్రోత్సహించాను.

"అయినదానికీ, కానిదానికీ, యెందుకు నామీద కోపంవొస్తూవుంటుంది మీకు? మళ్లీ చదువుకున్నవారు సర్వం తెలిసినవారు, నాకంటె పెద్దవారు కదా,—? భార్య అనగానే, లోకంలో ఉండే సర్వవిధములైన, సులక్షణాలు, నేర్పరితనం, పనిపాట్లయందు ప్రవీణత, ఆమెలో అంతర్భూతమై ఉంటా యనుకుంటారు కాబోలు మీమొగాళ్లు! కదూ?.........హితవుగా, కావలసిన పదార్థా లన్నీ చేసి, వేళకు వండి పెట్టాలి. క్లుప్తంగా, పొక్తుగా, ఖర్చువెచ్చాలు చూసుకొని, సంసారం గడపాలి. సదుపాయంగా, లెక్కకు మించకుండా, కన్ను ముక్కు తీరైన పిల్ల, పాప, కనాలి. వాళ్లని శ్రద్ధగా పెంచి, సుద్దులు బుద్ధులు నేర్పి సంరక్షణ చెయ్యాలి. చుట్టం పక్కం వస్తే, యింట్లో యేదీ వుందనక, లే దనక, గృహస్థుమర్యాదలకు లోటు రాకుండా జరపాలి. నౌకర్లున్నా, లేకపోయినా, యింట్లో అరవచాకరీ చెయ్యాలి. మొగుడి సదుపాయాలకి వేటికీ లోటు రాకుండా చూడాలి. ఇంట్లో యెవరికైనా రోగాలు రొష్టులు వస్తే, నిద్రాహారాలు మానుకొనైనా ఉపచారాలు చెయ్యాలి. చింకిబట్టలు కుట్టాలి. మురికిబట్టలు ఉతకాలి. ఇల్లు, వొళ్లు, శుభ్రంగా అందంగా ఉంచుకోవాలి. ఎన్నడూ జబ్బు గిబ్బు లేకుండా, ఆరోగ్యంగా బలంగా ఉండాలి. ఫిడేలో, వీణో వాయించగలిగి హాయిహాయి అనిపించేటట్లు పాడగలిగి ఉండాలి. వార్తాపత్రికలు, అవీ చదివి భర్తతో పొలిటిక్సు చర్చించగల సామర్థ్యం పొంది ఉండాలి— మొత్తంమీద ఆయన అభిప్రాయాలతో యేకీభవిస్తూ చదరంగం, పేక మొదలైన ఆటలు తెలివిగా ఆడుతూ, భర్తచేత ఓడిపించుకునే జ్ఞానం కలిగి ఉండాలి. నగలకు, బట్టలకు డబ్బుకోసం యెన్నడూ బాధించకుండా పుట్టింటివాళ్లనే పీడించుకొ తినాలి. అప్సరస్త్రీల అందం, అరుంధతి పాతివ్రత్యం, లక్ష్మీదేవిసౌభాగ్యం అన్నీ ఆమె యందు ప్రతిబింబితమై ఉండేటట్లు చేసుకోవాలి...... ఇన్ని చాకచక్యాలు, గుణాలు ఒక్కరిలో యెట్లా యిముడడానికి సాధ్యమనుకుంటారో? మళ్లీ ఆడదాన్ని 'అబల' అని, 'సుకుమారి' అని, 'కోమలి' అని వెక్కిరించే వెధవపేర్లు పెట్టి పిలుస్తారు మీమొగవాళ్లు. శక్తికి మించినభారం దానినెత్తిని మోపి తిన్నగా భరించలేకపోతే శిక్షిస్తా మంటారు, యెత్తిపొడుస్తారు, యెగతాళి చేస్తారు — అధికారం ఉంది కనుక! అయితే అజ్ఞానంచేత పురుషుడు యిట్లా ఆచరిస్తున్నాడేమో అనుకుందుకుకూడా వీలులేదు. బుద్ధిపూర్వకంగానే చేస్తాడు. కోడిసుద్దును పొదిగి, ఉష్ట్రి పక్షిని పైకి తీస్తా నంటాడు విపరీతం మనిషి.

"సరే 'నాకు చాత కాదు' అని ఆడది కాళ్లు చాచేకూడదా? మహాశక్తి సామర్థ్యాలు ఉన్నదానివలె అన్నిటికీ యెందుకు సిద్ధపడాలి? అని అడుగుతారేమో! ఆడదానికి అభిమానం, పౌరుషం యెక్కువ. చెయ్యలేనిపనినైనా చెయ్యనని చెప్పదు. అహంభావం అనుకోకండి. దాని ఖర్మం అది. ఈతరాని మనిషిని నీట్లో తోసి, 'ఈత నేర్చుకో—లేకుంటే చస్తావు' అని చెప్తారు మొగాళ్లు. అంతేకాని, మునిగినా తేలినా, చెయ్యి అందించి కాస్తయినా సహాయం చెయ్యరు.

"సృష్టికర్త స్త్రీని నిర్మించడంలో యెట్టి అభిప్రాయంతో చేశాడు? ఆమె యేయే పనులకు తగి ఉన్నది? ఆమెలో యెట్టి లక్షణాలు ఉండుట సహజము? అని ఆలోచించే బుద్ధిమంతుడు ఒక్కడు లేడు. మొగవాడు తను పెళ్లాడేటప్పుడు ఇంటిపని, వంటపని, చాకిపని, పాకిపని, కుట్టుపని, మట్టిపని, బిడ్డలపని, గొడ్లపని—అన్ని పనులకీ తనభార్య తగివుండి తీరా లనుకుంటాడు. న్యాయంపట్టి ఆలోచిస్తే, యిట్టిపనులకు వేటికీ ఆడది పనికేరాదు. దేవుడామె శరీరాన్ని యిట్టి పరి

శ్రమలకోసం తయారు చేయలేదు. కాపురానికి వెళ్లే పూర్వం యిట్టిపనులలో ఆమెకు తరిఫీదుకూడా ఉండదు. ఈపనులే నిజంగా మొగవాడు చేయడానికి శ్రద్ధ వహిస్తే యెంతో బాగా చేసుకో గలడు. ఒప్పుకుంటారా?"

"సరే. కొన్నికొన్ని పనిపాట్లు, యింట్లో ఆడదాన్ని రోకాయెంచి చేయించడం తప్పేనని వొప్పుకుంటాను. కాని వంట, కుట్టుపని — ఇట్టి పనులమాట యేం చెప్తావు? పెళ్లాం పిల్లలకి మొగుడే వండి పెట్టడం సబబని వాదిస్తావా?" అని అడిగాను.

"ఖమ్మాఁటికీని" అని తొణుకు బెణుకు లేకుండా జబాబిచ్చింది.

"చాల్లే! నెలకి మూడురోజులు అవస్థ పడడమే నాకు యజ్ఞం చేసినంత కష్టం అనిపిస్తూ వుంది. ఇక, నిత్యం రెండుపూటలా నన్నే మడికట్టుకోమంటావు కాబోలు? నీపుణ్యాం ఉంటుంది సుమీ —" అని నవ్వుతూ బ్రతిమాలడం అభినయించాను.

"లోకం అంటే మన యిద్దరమేనా యేమిటి? న్యాయం యీవిధంగా ఉన్నది కదా అని మనవి చేస్తున్నాను. అంతే కాని, మీ రిప్పుడే బెంగపెట్టుకో నక్కరలేదు."

"అంతేకద?"

"కాని నిజం ఆలోచించండి. వంటలో మొగవాడిని మెప్పించగల ఘనురాల్ని యెన్నడైనా కని, విని యెరుగుదురా? పురాణాల్లోకూడా గొప్పవంటకత్తె అని, యెవర్నీ మనకవులు వర్ణించినట్లు లేదు. నలపాకం, భీమపాకం అనే చెప్తారు కాని, ద్రౌపదిపాకం అని వినలేదు. పెళ్లివిందులకూ, సంతర్పణలకూ మొగవాళ్లనే వంటకు కుదర్చడం ఆచారం. హోటేళ్లలోను, సత్రములలోను వంటవాళ్లు మొగవాళ్లే ఉంటారు. శాస్త్రరీత్యా, అనుభవరీత్యా, న్యాయరీత్యా, పురుషపాకమే ప్రసిద్ధమైనప్పటికీ, ఇంట్లోమాత్రం ఆడదే వంట చెయ్యాలంటారు. సాధారణంగా స్త్రీలవి పురుషులను మెప్పించతగ్గ అమృతహస్తాలు కావు—వంటలో. చాతనైనట్లు యేదోమోస్తరుగా చేస్తే సంతోషిస్తారా? మీదుమిక్కిలి చీవాట్లు, ఆక్షేపణలు, పరిహాసాలు, రుసరుసలు!......

"కుట్టుపనిలోసహా మగవాడి కుండే నేర్పరితనం ఆడదానికి లేదు. మీదుస్తులు కుట్టే దర్జీవాళ్లు మొగవాళ్లేకద? ఆడదర్జీలకోసం పాకులాడకేం? ఇంట్లో మాత్రం పిల్లలబట్టలు, పరికిణీలు, చొక్కాలు, లాగులు, చేతిరుమాళ్లు, రవికలు, పాతగుడ్డలకు అతుకులు, చింకిబట్టలకి మాసికలు, అన్నీ పెళ్లామే కుట్టుకోవాలీ?"

"పోనీ, ఇక మీదట, సూది దారం నామీద పడెయ్యి. సహాయం చేస్తాను" అన్నాను పెంకెతనానికి.

"నమ్మకోవలసినదే!" అని తల ఊపుతూ "మొన్న కుట్టుకున్నారుగా, పంట్లాంగుండీలు? సన్నంగా వుందని, ఒకసూది విరిచేశారు. 'దబ్బనంలాటి సూది నానెత్తిని కొట్టినావు' అని నన్ను తిట్టి, రెండో సూది వేలుకు గుచ్చుకున్నారు."

"అంటే, కుట్టుపని నాకు చాతకాలేదన్నమాట విశదమేగా?"

"చాతగాక కాదు; అభ్యాసం లేక. చేసేవాళ్లుండగా, మనం యెందుకు చేసుకోవాలి, అని. కొన్నికొన్ని పనులలో చాతకానట్లు నటించడమే మొగవాడుగొప్పనుకుంటాడు. డిగ్నిటీకి లోటురాకూడదుగా, మరి? అన్నివిధాలా, పురుషుడు మహారాజు సృష్టికర్తకు ముద్దుకొడుకు! ఆడదాన్ని అధోగతికి తెచ్చి, దాన్ని పీడించి పిప్పిచేసి, యిష్టంవొచ్చినట్లు తనసౌఖ్యంకోసం ఉపయోగించుకొని, బానిసను చేసి, దానిమీద సవారీ చెలాయించగలుగుతున్నాడు. ఆడదానిసహనశక్తికి హద్దు లేకుండా ఉంది. ఎన్నిటికైనా ఓర్చుకుంటూ నంటుంది. ఓర్చుకున్నకొద్దీ, ఆమెమీద అత్యాచారాలు చేస్తునేఉంటాడు మొగవాడని తెలుసుకోదు. అయితే, నాసంగతి, మీసంగతి దృష్టాంతంగా తీసుకొని చెప్తున్నా ననుకోకండి. లోకంతీరుకు వగస్తున్నాను. అంతే కాని—"

ఆమె యిచ్చే ఉపన్యాసం వింటూ, మొహం చూస్తూవుంటే, ఈమె నాలక్ష్మేనా? అనిపిస్తూవుంది. చెయ్యిమీద తల ఆనుకుని, నాగుండెమీదికి కొంచెం వొరిగి, నామొహంలోకి జిగజిగలాడే ఆమెరుపుకళ్లతో చూస్తూ, ఉద్రేకంతో మాట్లాడుతూ వుంది. ఎదురు చెప్పడానికి యేమీ పాలుపోకుండా ఉంది, నాకు. సూటిగా దానిమొహంవేపు చూడడానికే సిగ్గుగా ఉంది. ఉదయంనుండి, యెందుకో లక్ష్మిమీద నాకు కోపం గానే ఉండెను. కాని, నిజంగా ఆలోచిస్తే, తగిన కారణం యేదీ కనిపించకుండా వున్నది.

---

# ఘనోపాలంభము

టి. రంగాచార్యులు గారు

ఒకచోటం బెనుగొండలంబలె సమగ్రోదగ్రరూపంబుతో
నొకచో నేనుఁగుపిండుచందమున సద్యోద్భిన్నరూపంబుతో
నొకచోట న్వివిధాకృతు ల్గలుగగా వ్యోమస్థితంబౌ వలా
హకసందోహమ! యైంద్రజాలికపటు వ్యాపారము ల్నేర్చితో!

అఱచేతిమాత్ర మీ వాదిని గాన్పించి యంతలో నింగిని నావరింతు
వావరించినయంత నత్యంత వృష్టిచే బుడమి నెల్లెడ నీట ముంచివైతు
వొకవేళ బెల్లుగ నుఱుముచు మిన్నుమ న్నొకటిగ జేసెదు నోజగాగ
దండతండములుగ దనరారుచుండియు నంతలోనె యదృశ్య మగుచునుందు
వొకమాఱు మానంబు నూని సువృష్టిచే బ్రాణిసంతతికిని రహిని గూర్తు
విట్టులిచ్ఛావిహారంబు వేడ్కయొసగ - నెఱపుచుండెదు నిను జూడ నెమ్మనమున
మొఱుగుకుక్క యొకప్పుడు గఱవదటులె - కఱచుకుక్క యొకప్పుడు మొఱుగదనెడు
నుడి నిజంబంచు దోచు ఘనోత్కరంబ!

కురిసితి వంగదేశమున గుండలబోసినయట్లు వర్షముల్
పురములు సస్యము ల్నరులు మున్గిరి నీట నటంచు వింటి మీ
వరయగ బశ్చిమాంధ్రముల వర్షపుజుక్క నొసంగకుండగా
నరతతి జీవరాశి కఠినస్థితి నున్న దిదేమి న్యాయమో!

ఘనుడ వనునామమున నీవు తనరుచుంట - నిట్టి వైషమ్యబుద్ధి నీకెట్టు లబ్బె
నంచు నెంచితిగాని ఘనాఘనాఖ్యయుం గలదుగాదె నీ కంచు నూఱడిలితి.

---